DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
బుధవారం, నవంబరు 22, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అంతర్జాలంలో భద్రాచలం ఉత్తరద్వార దర్శన టికెట్లు



భద్రాచలం (వాయిస్ టుడే): వైకుంఠ ఏకాదశి మహోత్సవం సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో డిసెంబరు 23న ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారదర్శనం ఉంటుందని ఈవో రమాదేవి తెలిపారు. ఇందులో ప్రత్యక్షంగా పాల్గొనే భక్తులు కూర్చునేందుకు సెక్టార్లను ఏర్పాటు చేయనున్నారు. రూ.2000, రూ.1000, రూ.500, రూ.250 చెల్లింపుతో టికెట్లు తీసుకున్న వారికి ఆయా సెక్టార్లలోకి ప్రవేశం కల్పించనున్నారు. ఈ టికెట్లు https:// bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్‌లో బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అంతర్జాలంలో బుక్ చేసుకున్నవారు ఒరిజినల్ టికెట్లను డిసెంబరు 13 నుంచి 23వ తేదీ ఉదయం 5 గంటల వరకు రామాలయ కార్యాలయంలో తీసుకోవాలని తెలిపారు. భద్రాచలం రాలేనివారికి ఆన్‌లైన్‌లో రూ.2000, రూ.1000 టికెట్ రుసుము చెల్లించి తమ గోత్ర నామాలతో పూజ చేయించుకునే వెసులుబాటునూ కల్పించారు.



## రేవంత్ నోరు తెరిస్తే గబ్బు..
## అలాంటోళ్లు అవసరమా?

కొడంగల్ (వాయిస్ టుడే): పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. కొడంగల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ మాట్లాడుతూ రేవంత్ టార్గెట్‌గా మండిపడ్డారు. "కొడంగల్‌లో రేవంత్ రెడ్డి పెద్ద భూకబ్జాదారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటున్నారు. రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలాంటి పనులు చేయలేదు. రేవంత్ నోరు తెరిస్తే గబ్బు. ఆయన టికెట్లు అమ్ముకున్నారని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. తెలంగాణ ఉద్యమకారులపైకి రేవంత్ తుపాకీ పట్టుకొని వెళ్లారు. కాంగ్రెస్ నేతలకు వ్యవసాయం గురించి ఏమీ తెలియదు. రేవంత్ రెడ్డి ఏనాడైనా వ్యవసాయం చేశారా? పొలం దున్నారా? అందుకే ఇలా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు." అని ధ్వజమెత్తారు.

"నీతి నియమం లేని వ్యక్తి రేవంత్ రెడ్డి. రూ.50 లక్షలతో ఎమ్మెల్యేలను కొంటూ పట్టుబడిన ఆయన తీరును ప్రజలంతా టీవీల్లో చూశారు. ఇవన్నీ చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు కొడంగల్‌లో సరిపోలేదని.. కామారెడ్డిలో నాపై పోటీకి వస్తున్నారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో చిత్తుగా ఓడించాలి. నేనే సీఎం అనేవాళ్లు కాంగ్రెస్‌లో 15 మంది ఉన్నారు. అయినా కాంగ్రెస్ గెలిస్తే కదా.. రేవంత్ సీఎం అయ్యేది. రేవంత్ సీఎం అవుతాడని ఓట్లేస్తే కొడంగల్ పరిస్థితి మళ్లీ మొదటికే. ప్రజలు ఇవన్నీ గమనించాలి. కొడంగల్‌లో పనిచేసే నరేందర్ రెడ్డి కావాలా? వట్టిమాటలు చెప్పే రేవంత్ రెడ్డి కావాలా? ప్రజలే తేల్చుకోవాలి. ఎమ్మెల్యేగా ఎవరుంటే కొడంగల్ గౌరవం పెరుగుతుందో ప్రజలే నిర్ణయం తీసుకోవాలి" అని కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రచారంలో కమల సారధి కిషన్‌రెడ్డి ఎక్కడ..?



తెలంగాణలో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. గెలుపు కోసం అన్ని పార్టీల అభ్యర్థులు.. తీవ్రంగా శ్రమిస్తున్నారు. గులాబీ అధిపతి కేసీఆర్, పీసీపీ చీఫ్ రేవంత్ రెడ్డి తెలంగాణ అంతటా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రోజుకు సాధ్యమైనంత ఎక్కువగా బహిరంగ సభలతో జనాల్లో ఉండేలా చూసుకుంటున్నారు. కానీ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి పాత్ర మాత్రం పరిమితం గానే ఉందని చెప్పాలి. ఎన్నికల క్యాంపెయిన్‌లో కిషన్ రెడ్డి హడావుడి పెద్దగా కనిపించడం లేదు. కేవలం గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రచారానికే ఆయన పరిమితం అవుతున్నారు. హైదరాబాద్ దాటి...మిగతా జిల్లాల్లో ఎక్కువగా పర్యటించడం లేదు. అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు తప్పా తెలంగాణ వ్యాప్తంగా ఒంటరిగా భారీ బహిరంగ సభలను నిర్వర్తించలేకపోతున్నారు కిషన్ రెడ్డి. తెలంగాణ బీజేపీ చీఫ్. కమలదళానికి రథ సారధి. కానీ ఎన్నికల ప్రచారంలో ఆ పాత్రను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతను సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో కమలం పార్టీని ముందుండి నడిపించడం లేదని, ఆయన ఒక్క హైదరాబాద్ బీజేపీకే అధ్యక్షుడా లేక రాష్ట్రం మొత్తానికి అధ్యక్షుడా అంటూ సొంత కేడరే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిలా. గెలుపు బాధ్యతలను ఎందుకు భూజాల మీదకు ఎత్తుకోవడం లేదని, వారిలా రాష్ట్రం మొత్తం ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ మేనిఫెస్టోను జనాల్లోకి తీసుకెళ్లడంలోనూ ఆయన విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కనీసం బండి, ఈటల అయినా మిగతా నియోజకవర్గాలకు వెళ్తున్నారు తప్పా.. కిషన్ రెడ్డి మాత్రం పార్టీ అధ్యక్షుడు అయ్యి ఉండి... ఇలా గ్రేటర్ హైదరాబాద్‌ను దాటకపోవడం ఏంటని సొంత పార్టీ అభ్యర్థులే నిలదీస్తున్నారు. బండి సంజయ్ చీఫ్‌గా ఉన్నప్పుడు బీజేపీ చాలా దూకుడుగా వెళ్లింది. బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నంతగా పుంజుకుంది. కానీ బండి సంజయ్ మార్పు తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టిన కిషన్‌రెడ్డి..ఆ వేవ్‌ను కంటీన్యూ చేయలేకపోయారు. పార్టీ కార్యక్రమాల్లో వేగం తగ్గింది. ఫలితంగా ఎన్నికల నాటికి బీజేపీ గ్రాఫ్ పడిపోయి కాంగ్రెస్ రేసులోకి వచ్చింది. కనీసం బీజేపీ గెలిచే స్థానాలపైనా కిషన్‌రెడ్డి ఫోకస్ పెట్టడం లేదని, వారి గెలుపు కోసం ప్రచారం చేయకపోవడం ఏంటనే విమర్శలు వస్తున్నాయి. పార్టీ చీఫ్‌గా విఫలం అవుతున్నారని సొంత కేడరే మండిపడుతున్నారు.

### ఉద్యోగాల పేరుతో కేసీఆర్ నిరుద్యోగులకు అన్యాయం చేశారు
#### ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి ఫైర్





కేసీఆర్ పై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఫైర్ అయ్యారు. నీళ్లు, నిధులు నియమకాల పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారని పురంధేశ్వరి విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురనగర్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగాల పేరుతో కేసీఆర్ నిరుద్యోగులకు అన్యాయం చేశారని పురంధేశ్వరి మండిపడ్డారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పురంధేశ్వరి అన్నారు.




## కేసీఆర్ రాసిపెట్టుకో.. కాంగ్రెస్‌కు 80 సీట్లు ఖాయం

నిజామాబాద్ (వాయిస్ టుడే): సీఎం కేసీఆర్ రాసిపెట్టుకో కాంగ్రెస్ పార్టీకి 80 సీట్ల కంటే ఒక్క సీటు తగ్గదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాడు దర్పల్లిలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..."డిసెంబర్ 3వ తేదీన లెక్క చూసుకో కేసీఆర్.. 80 కంటే ఒక్కటి తక్కువున్నా ఏ చర్యకైనా సిద్ధం. కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు. ఇక్కడ పోడు భూముల సమస్య తీరలేదు. గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తీరుస్తానని పదేళ్లయినా తెరువలేదు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇక్కడి రైతులు ఓడించారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేసి వారి హక్కులను కాలరాశారు. అయ్య బక్కోడు.. కొడుకు తిరుగుబోతోడు. ప్రజలను ఆదుకోవాలంటే ఒక్కరూ ముందుకు రారు.ఎర్రజొన్న రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయలేదు. పసుపు బోర్డు తెస్తానన్న గుండోడు ఎక్కడికో పోయిండు. నేను పాదయాత్ర చేసినప్పుడు ఈ ప్రాంత యువకులు నన్ను ఇక్కడి నుంచి పోటీ చేయమని అడిగారు. అధిష్ఠానం నన్ను కామారెడ్డిలో పోటీ చేయమని ఆదేశించింది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

### మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది

"ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎవరు గెలుస్తారో రాష్ట్ర ప్రభుత్వం అదే వస్తుంది. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం. మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది. మీరు కట్టిన ప్రాజెక్టులు చూపించి బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి. మేము కట్టిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు చూపించి ఓట్లు అడుగుతాం. ఇందిరమ్మ రాజ్యం అంటే గరీబోళ్ల రాజ్యం. బీఆర్ఎస్ అంటే దొరల రాజ్యం, దొంగల రాజ్యం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ ఊహాలోకంలో ఉంచారు. ఆయన మాత్రం 150 రూముల బంగ్లా కట్టుకున్నాడు. బోధన్ ఏసీపీకి చెప్తున్నా.. నీ నౌకరి నువ్వు చెయి.. బీఆర్ఎస్ కార్యకర్తలాగా చేయకు.. డిసెంబర్ 3వ తేదీ తర్వాత ఏమైతదో చూడు కేసీఆర్" అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

## వరంగల్ పోరాట స్ఫూర్తితోనే ఆంధ్రాలో గూండాల పాలనను తట్టుకుంటున్నా..
### తెలంగాణ ఎన్నికల ప్రచారంలో జనసేనాని పవన్ కల్యాణ్




హనుమకొండ (వాయిస్ టుడే): ఆంధ్రాలో రౌడీలు రాజ్యామేలుతున్నారని, గూండాల పాలన నడుస్తోందని, అలాంటి పరిస్థితుల్లో తట్టుకుని నిలబడుతున్నానంటే వరంగల్ పోరాటస్ఫూర్తే కారణమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వరంగల్ నియోజకవర్గంలో బీజేపీ నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. "తెలంగాణ నా గుండెచప్పుడు. ఇకపై తెలంగాణలోనూ అడుగుపెడుతున్నాను. తెలంగాణ ధైర్యంతోనే ఆంధ్రాలో రౌడీలను, ఫ్యాక్షనిస్టులను ఎదుర్కొంటున్నాను" అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం హనుమకొండలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభలో పవన్ పాల్గొని ప్రసంగించారు. బలిదానాల తెలంగాణలో ఇంత అవినీతి ఉంటుందని తాను ఊహించలేదన్నారు. కమీషన్ల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. ఆంధ్రా జన్మనిస్తే తెలంగాణ పునర్ జన్మనిచ్చిందని అన్నారు. పదేళ్లలో తాను తెలంగాణపై మాట్లాడలేదని అన్నారు. ప్రధాని అంటే తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. దశాబ్దం తర్వాత మాట ఇస్తున్నానని... వచ్చే ఏడాది నుంచి ఆంధ్రాలో లాగే తెలంగాణలోనూ తిరుగుతాను అని జనసేనాని స్పష్టం చేశారు. బీసీ ముఖ్యమంత్రి కావాలని కోరుకునే వారిలో తాను కూడా ఉన్నానన్నారు. తెలంగాణలో జనసేన ఉంటుందని.. తెలంగాణలో బీజేపీతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే జనసేన స్థాపించామని తెలిపారు. 2009లో స్థాపించిన పార్టీ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే కారణమని చెప్పుకొచ్చారు. నాడు తెలంగాణకు మద్దతు ఇచ్చిన వారిలో తాను ఒకడిని అని అన్నారు. బీజేపీ అభ్యర్థులు రావుపద్మ, ప్రదీప్ రావును గెలిపించాలని కోరారు. సమస్యలొస్తే తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తెలంగాణలో దళిత ముఖ్యమంత్రిని చూడలేకపోయామని.. బీసీ ముఖ్యమంత్రినైనా చూడాలని అందుకే బీజేపీతో కలిసినట్లు తెలిపారు. జనసేన - బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పవన్ కళ్యాణ్ కోరారు.

## బీజేపోడు గెలిస్తే మోటార్లకు మీటర్లు వస్తాయని ఆ రోజే చెప్పినా..



సిద్దిపేట (వాయిస్ టుడే): ప్రభుత్వం దౌల్తాబాద్ భూంపల్లిలో కుంట భూమి కూడా తీసుకునే ప్రసక్తే లేదని మంత్రి హరీష్ రావు హామీ ఇచ్చారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా బైక్ ర్యాలీలో మంత్రి హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల వద్ద ఉన్న పోరంబోకు భూములను పట్టా భూములుగా మార్చుతామని వాగ్దానం చేశారు. గత ఉప ఎన్నికల్లో రఘునందన్ రావును ఎమ్మెల్యేగా గేలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. 'రఘునందన్ రావు ఢిల్లీ నుంచి పరిశ్రమ తెచ్చిండా? రైలు తెచ్చిండా? అని ఏమైనా నిధులు తెచ్చిండా?' అని హరీష్ రావు ప్రశ్నించారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకమని.. ఒక విశ్వాసమని అన్నారు. బీజేపోడు గెలిస్తే మోటార్లకు మీటర్లు వస్తాయని ఆ రోజే చెప్పానని, నిన్ననే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నది ఉన్నట్లుగా చెప్పారన్నారు. కేసీఆర్ మోటార్లకు మీటర్లు పెట్టలేదు కాబట్టి తెలంగాణకు వచ్చే 25 వేల కోట్లు ఆపామని నిర్మలమ్మ చెప్పారని అన్నారు. బోర్లకాడ మీటర్లు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు పెడుతున్నాయని నిర్మలా సీతారామన్ చెప్పారని హరీష్ రావు పేర్కొన్నారు.

## బండి సంజయ్ కరీంనగర్ పరువు తీశారు



కరీంనగర్ (వాయిస్ టుడే): బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. ఏబీఎన్‌తో మంత్రి మాట్లాడారు. బండి సంజయ్ కరీంనగర్ పరువు తీశారని విమర్శించారు. గ్రానైట్‌లో అవినీతి జరిగిందని హడావుడి చేసి మాయమయ్యారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్‌కి బియ్యానికి వడ్లకు తేడా కూడా తెలియదు అని ధ్వజమెత్తారు. రేపో మాపో గుండెపోటు వచ్చిందని మళ్లీ అపోలోకి వెళ్తారని వ్యాఖ్యానించారు. బీజేపీలో టికెట్లు అమ్ముకున్నారని కరీంనగర్ ప్రజలకు బాగా తెలుసని ఆరోపించారు. అయినా సంజయ్ చెప్పే మాటలు జనాలు నమ్మడం లేదన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
బుధవారం, 22 నవంబరు, 2023

# అంబేడ్కర్, కాన్షీరామ్ కలలను సాకారం చేయాలి: బీఎస్పీ అధినేత్రి మాయావతి

సూర్యాపేట : అంబేడ్కర్, కాన్షీరామ్ కలలను మనం సాకారం చేయాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి పిలుపునిచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన ప్రచారసభలో మాయావతి పాల్గొని ప్రసంగించారు. యూపీ తరహాలో తెలంగాణలోనూ బీఎస్పీని ఆదరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటించినా వాటిని అమలు చేయట్లేదన్నారు. బీఎస్పీని గెలిపిస్తే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా మాయావతిని బీఎస్పీ నాయకులు గజమాలతో సత్కరించారు.





## మున్నూరు కాపుల మద్దతు బీఆర్ఎస్‌కే

### మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

ఎల్బీనగర్ (వాయిస్ టుడే): మున్నూరుకాపులు నమ్మకానికి ప్రతీకలని, మాట ఇస్తే మడమ తిప్పరని, మాట మరువరని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బుధవారం మున్నూరుకాపుల దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ మున్నూరు కాపుల మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మాట ఇచ్చిన మున్నురుకాపులు మాట నిలుపుకుంటారని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్ కు సబ్బండ వర్ణాలు ఈ ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు.ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మున్నూరుకాపుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తగ్గించడానికి దేశంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా పార్కులను అభివృద్ధి చేశానన్నారు. హైటెక్ సిటీకి పోటీ పడే విధంగా నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో తీర్చిదిద్దుతానని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ మున్నూరుకాపులు సంఘటితంగా, సమైక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో మున్నురుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తంరావు, మాజీ కౌన్సిలర్ త్రివేది, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు పటేల్, మల్యాల మదన్ పటేల్, అరుణా పటేల్, ఎల్బీనగర్ మున్నురుకాపు సంఘం అధ్యక్షుడు తోట రాజు పటేల్, ప్రధాన కార్యదర్శి అనంతుల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి

### ఆశీర్వదించి ఒక్కసారి అవకాశం ఇవ్వండి

### కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ (వాయిస్ టుడే): ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు.ప్రజల కష్టాలు తెలిసిన బిడ్డగా తనను ఆశీర్వదించి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిదన్నారు. ప్రజలు కోల్పోయిన భూమికి బిఅర్ఎస్ ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వకపోగా,వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఆనాటి నుండి నేటి వరకు ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉండి అలుపెరగని పోరాటం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉండి వారి సమస్యలకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.ఎన్నికల్లో పోటీ చేసే అవకాశవాదులు కేవలం అధికారం కోసమే ప్రజలకు వద్దకు వస్తారని,ప్రజల కష్టాలను పట్టించుకోరని తెలిపారు. గతంలో ముంపు గ్రామాల ప్రజలు పడ్డ కష్టాలు, కన్నీళ్ళు ఎవ్వరూ మర్చిపోవద్దన్నారు.మంచి నాయకుడిని ఎన్నుకున్నపుడే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.ప్రజల బాధలు దగ్గర చూసిన వ్యక్తిగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని,నాలుగు సార్లు ఓడి పోయిన ప్రజల మధ్యనే ఉన్నానే కానీ,పరాయి దేశం పోలేదన్నారు.బిఅర్ఎస్,బిజేపి నాయకులు కేవలం అధికారం, పదవుల కోసం మాత్రమే మాయ మాటలు చెపుతున్నారని,వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మి మరోసారి మోస పోవద్దన్నారు.ఈ నెల 30న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి చేతి గుర్తుపై ఓటు తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు పథకాలను అమలు చేసి తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండే పాలన కొనసాగిస్తామన్నారు.నియోజకవర్గంలో ఎక్కడికి పోయిన ప్రజలు చూపించే ప్రేమాభిమానాలే తనను కొండంత ధైర్యమని,తమ బిడ్డగా ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బింగి మహేష్ నాయకులు కూస రవి పిల్లి కనకయ్య శ్రీనివాస్ గౌడ్ పెద్ద ఎత్తున ముంపు గ్రామాల ప్రజలు,మహిళలు,యువకులు పాల్గొన్నారు.

## నా వెంట 30 తారీకు ఒక్క రోజు నడవండి...

### మీ గడప గడపకి సంక్షేమ పథకాలు అందిస్తా

### బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు



వేములవాడ :(వాయిస్ టుడే): కథలాపూర్ మండలం తండ్రియాల, గంబిర్పూర్, తక్కల్లపల్లి, బొమ్మెన, దూలుర్,చింత కుంట,(రాజారాం తండా),భుషణావు పేట, ఉట్టల్లి, పెగ్గర్ల. కతలాపూర్ సిరికొండ గ్రామాలలో బిజెపి ఎన్నికల ప్రచారం నిర్వహించిన బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చెన్నమనేని వికాస్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ మన దేశంలో ఉండే వారి కోసమే కాకుండా దేశం అవతల ఉన్న భారతీయుల కోసం కూడా ఆలోచన చేసి గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారు అని మరోసారి ప్రజలకి గుర్తు చేసారు.భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోల్ ధరలు తగ్గుతాయని, పిల్లల బడి ఫీజుల పైన నియంత్రణ కమిటీ వేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచాం అన్నారు.ఎమ్మెల్యే గా గెలిచిన కొద్ది రోజుల్లోనే నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం అయితే స్వంత డబ్బు ఖర్చు పెట్టుకుని అయినా మంచి మౌలిక వసతులు కల్పిస్తామని వికాస్ అన్నారు.నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కి తొలి బీసీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయడం కోసం మీ అందరి ఆశీర్వాదం కావాలి అన్నారు.వికాస్ గెలుపు బీసీల గెలుపు అవుద్ధి అని వేములవాడ ప్రజల గెలుపు ఆవుద్ది అని అన్నారు.నా వెంట 30 తారీకు ఒక్క రోజు నడవండి రాబోయే 5 యేళ్లు మీ వెంట నేను నడుస్తా మీ గడప గడపకి సంక్షేమ పథకాలు అందిస్తా అని ఆయన భరోసా ఇచ్చారు.ఫించను రాదు అని మిమ్మలిని బెదిరిస్తే నాకు చెప్పండి ఫించన్ డబ్బులు ఎవడబ్బ సొత్తుకాధు,ప్రజల డబ్బు ప్రజలకు దాన్ని పొందే హక్కు ఉంది అని ఘాటుగా స్పందిచారు.తెరాస అవినీతి పాలన పోవాలి అంటే అది కేవలం బిజెపి వల్ల మాత్రమే సాధ్యం అని,అమ్ముడు పోయే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఓటు వేసి మీ ఓటు వృదా చేసుకోవద్దు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మహిళలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## అసైన్డ్ భూములున్న వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తాం : కేటీఆర్

చౌటుప్పల్ : కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తెలంగాణ అంధకారమేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ విమర్శించారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 60 ఏళ్ల పాటు మునుగోడు ప్రజలను ఇబ్బందికి గురి చేసింది ఎవరని ప్రశ్నించారు. గతంలో 11 ఛాన్స్‌లు ఇచ్చినప్పుడు కాంగ్రెస్ నేతలు ఏం చేశారని కేటీఆర్ నిలదీశారు.

అది మునుగోడు ప్రజలకు తెలుసు : గతంలో కాంగ్రెస్‌లో గెలిచిన అభ్యర్థి బీజేపీ లోకి వెళ్లారని, ఆయన అక్కడికి ఎందుకు వెళ్లారో మునుగోడు ప్రజలకు తెలుసని చెప్పారు. 55 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రైతుబంధు ఎందుకివ్వలేదని దుయ్యబట్టారు. 3 గంటల కరెంట్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ చెబుతున్నారని, వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందో? లేదో?ప్రజలే చెప్పాలన్నారు. కరెంట్ కావాలో? కాంగ్రెస్ కావాలో? తేల్చుకోవాలన్నారు. మరోసారి భారాస అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.5 వేలకు పెంచుతామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్ భూములు ఉన్న వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామని చెప్పారు.

జాబ్ క్యాలెండర్‌పై దృష్టి సారిస్తాం : బీజేపీ సిద్ధాంతాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో అమలు చేస్తున్నారని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రధాని మోదీని రేవంత్ ఒక్కసారి కూడా విమర్శించలేదన్నారు. కాంగ్రెస్ హవా అనేది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మాత్రమేనని ఎద్దేవా చేశారు. 80 సీట్లలో మళ్లీ భారాస అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేళ్లలో మైనార్టీలకు చాలా చేశామని, వారి మద్దతు తమకే ఉందని చెప్పారు. ఎన్నికల ఫలితాలు రాగానే జాబ్ క్యాలెండర్‌పై దృష్టి సారిస్తామన్నారు. అలాగే రైతు బంధు చెల్లింపులకు అనుమతివ్వాలని ఈసీని 2 సార్లు కోరామని మంత్రి కేటీఆర్ తెలిపారు. పీఎం కిసాన్‌కు లేని అడ్డంకి రైతుబంధుకు ఎందుకని ప్రశ్నించారు.

## ఎమ్మెల్యే షకీల్‌పై కాంగ్రెస్ దాడిని ఖండించిన కవిత



నిజామాబాద్: బోధన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ..."ఓటమికి భయపడే బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. 60 లక్షల గులాబీ సైన్యం ముందు మీరెంత. సత్తా కలిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులను ప్రజాక్షేత్రంలో దీటుగా ఎదుర్కొంటారు. ఇలాంటి దాడులకు తెగబడితే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు" అని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేసీఆర్, మోదీ, ఓవైసీ ముగ్గురు తోడు దొంగలే



ఆలంపూర్: సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ముగ్గురు తోడు దొంగలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బుధవారం నాడు ఆలంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ..." తెలంగాణ ప్రజలు ఇచ్చే విజయ కానుకను భారతదేశం మొత్తం ప్రతిబింబిస్తుంది. ఆలంపూర్ చాలా పవిత్రమైన ప్రాంతం.. కృష్ణ మరియు తుంగభద్రాల సంగమ ప్రాంతం. దేశంలో ఉన్న మూడు పత్రికల సుమారు 780 కోట్ల ఆస్తులను బీజేపీ ప్రభుత్వం జప్తు చేసింది. ఈ మూడు పత్రికలు నెహ్రూ సొంత ఆస్తి. నెహ్రూ స్థాపించిన ఈ మూడు పత్రికలు స్వతంత్ర పోరాటానికి ముఖ్య భూమికను పోషించాయి" అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.

### పేదలను ఆదుకోవడంలో బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేస్తున్నాయి

"నిరుపేదలను ఆదుకోవడంలో బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇందిరాగాంధీ నీ విమర్శిస్తున్నావు ఇందిరాగాంధీ ఎక్కడ.. మరి కేసీఆర్ ఎక్కడ.. ఫామ్ హౌస్‌లో కూర్చొని పరిపాలిస్తున్నావు. 2017లో ఇచ్చిన నీ హామీలు ఏమయ్యాయి.. ఏ ఒక్కటి పూర్తి చేయలేదు. తెలంగాణ కోసం అప్పట్లో ఎంపీగా ఉన్న విజయశాంతి ఢిల్లీలో పార్లమెంట్‌లో సభ జరిగినప్పుడు తెలంగాణ కోసం స్పీకర్ పోడియంలోకి వెళ్లి 4, 5 గంటలు పోట్లాడింది.. ఆ సమయంలో నువ్వు ఎక్కడున్నావ్ కేసీఆర్.. కేసీఆర్,కొడుకు, కూతురు, అల్లుడు తెలంగాణను దోచుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం" అని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.



## వనమాకు బీఆర్ఎస్ టికెట్ అత్యంత దయనీయం

భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుపై మాజీ ఎంపీ రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో రేణుకా చౌదరి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన వనమా కుటుంబానిది హంతక చరిత్ర అని అన్నారు. కబ్జా కోరు, అవినీతిపరుడు వనమాకు బీఆర్ఎస్ టికెట్ అత్యంత దయనీయమన్నారు. ఓటు అనే ఆయుధంతో నిజాయితీపరుడు సాంబశివరావును గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అవినీతి సొమ్ము ఇస్తే తీసుకున్నా... కాంగ్రెస్ మిత్రపక్షాన్ని గెలిపించాలని ఆడబిడ్డగా వేడుకుంటున్నట్లు తెలిపారు. ట్రైలర్ చూపించి ఓట్లు అడిగే జలగం ఎన్నికలయ్యాక అడ్రస్ ఉండరన్నారు. సాంబశివరావును గెలిపించాలని.. ఇద్దరం కలిసి ఇక్కడ అభివృద్ధి చేస్తామని.. ప్రజలకు అండగా ఉంటామని రేణుకా చౌదరి హామీ ఇచ్చారు.

## పవన్ కళ్యాణ్ ఎవడు..? ఎక్కడి నుంచి వస్తున్నాడు?

కరీంనగర్ : మరో వారం మాత్రమే మిగిలివుండడంతో తెలంగాణలో ఎన్నికల ప్రచారం మరింత జోరందుకుంది. అన్ని పార్టీలకు చెందిన నేతలు, శ్రేణులు ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. ప్రత్యర్థి పార్టీలు, నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. కరీంనగర్ స్థానం నుంచి ఎన్నికల బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ బుధవారం ఆసక్తికరంగా మాట్లాడారు. కేఏ పాల్ ఎవడు..? సీఎం కేసీఆర్‌ను చంపుతా అంటున్నాడని మంత్రి గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. వాడిది అసలు ఏ ఊరు అంటూ ఫైర్ అయ్యారు. పవన్ కళ్యాణ్ ఎవడు..? ఎక్కడి నుంచి వస్తున్నాడని మండిపడ్డారు. ఒక్క రూపాయి ఇయ్యను అన్న కిరణ్ కుమార్ తెలంగాణకు ఎందుకు వచ్చిండని గంగుల ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్ళు దొంగలని.. ఢిల్లీ గులాములని పేర్కొన్నారు. బండి సంజయ్ తన మీద మూడోసారి ఓడిపోతాడన్నారు. గుండె పోటు డ్రామాను నమ్మొద్దని గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన దివ్యవాణి

### మాణిక్ రావ్ ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన దివ్యవాణి



హైదరాబాద్ (వాయిస్ టుడే): ప్రముఖ సినీ నటి దివ్యవాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జీ మాణిక్ రావ్ ఠాక్రే సమక్షంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దివ్యవాణికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఠాక్రే సాదరంగా ఆహ్వానించారు. 2019లో దివ్యవాణి టీడీపీలో చేరారు. పార్టీ నేతలతో ఏర్పడిన విభేదాల కారణంగా గత ఏడాది టీడీపీకి గుడ్ బై చెప్పారు. దివ్యవాణి చేరికతో కాంగ్రెస్ కు మరింత సినీ గ్లామర్ వచ్చింది. ఇప్పటికే బీజేపీని వీడి కాంగ్రెస్ లో చేరిన విజయశాంతి ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. అయితే, దివ్యవాణికి పార్టీ నాయకత్వం ఎలాంటి బాధ్యతలను అప్పగిస్తుందనే విషయం వేచిచూడాలి. ప్రస్తుతం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది.